# పెద్దలకు మాత్రమే



ఎ. కల్యాణి శ్రీనివాస్

## నేను నేనే

**హెచ్చరిక**

ఇప్పుడు మీరు సెంటర్ సెన్సేషన్ కథ చదువుతున్నారు. ఈ కథలు పెద్దలకు మాత్రమే ప్రత్యేకించి రాయిస్తున్నవి. సకుటుంబంగా చదువుకునే ఆంధ్రభూమిలో పర్సనల్‌గా చదువుకునే కథ సెంటర్ సెన్సేషన్. (పిల్లలు చదవకూడదని అనుకుంటే) మీరు మాత్రమే చదువుకుని చిన్నవాళ్ళు చదవకుండా జాగ్రత్తపడేందుకు ఒక సౌకర్యం కూడా వుంది. సెంటర్ సెన్సేషన్ కేవలం 'అడల్ట్ స్టోరీ' అనుకున్నవాళ్ళు ఈ కథ నాలుగు పేజీలు 'ఫక్'మని లాగేస్తే పుస్తకంనుంచి వేరైపోతాయి

ఈ పేజీలని మీరు మంచి మూడ్‌లో వున్నప్పుడు మళ్ళీ చదువుకోడానికి అనుకూలంగా ఇంచక్కాగా సెంటర్ సెన్సేషన్ కలెక్షన్‌గా ఫైల్ చేసుకోవచ్చు.

# సెంటర్ సెన్సేషన్

ఆ నీలిరంగు డిమ్ లైట్ కాంతి బెడ్ రూమ్‌లో వింతగా ప్రతిఫలిస్తోంది. విశాలమైన డబుల్ కాట్స్ మీద వున్న బాంబేడయింగ్ దుప్పటిమీద వున్న నీలి కలువల ప్రింటు మరింత నీలంగా మెరుస్తోంది. ఆ నీలిరంగు మనసు మత్తెక్కేలా వుంది. ఆ బెడ్ మీద ఒకరి కౌగిలిలో ఒకరు పరవశించిపోతున్నారు హాసిత, పవన్ న్యూలీ వెడెడ్ కపుల్.

వున్నట్టుండి పిల్చాడు పవన్ "హాసినీ"

ఆ పిలుపు విన్న హాసిత చటుక్కున అతని కౌగిలి విడిపించుకుంది.

ఏమైంది? అడిగాడు పవన్.

మీకు ఎన్నోసార్లు చెప్పాను నన్ను ఆ పేరుతో పిలవద్దని చిరాకుపడుతూ అంది హాసిత.

అరే ఏమైందోయ్ అలా పిలిస్తే అయినా "హాసిత" అన్నా "హాసినీ" అన్నా అర్థం ఒకటేగా నవ్వుతూ అన్నాడు పవన్.

ఏమో? నాకు నా పేరుతో పిలిస్తేనే ఇష్టం. అయినా పగలల్లా నన్ను హాసిత అనే పిలుస్తారు. రాత్రి "ఈ టైమ్"లోనే మాత్రం "హాసినీ" అంటారేం? ప్రశ్నించింది హాసిత.

ఓ అదా! తేలిగ్గా నవ్వేశాడు పవన్. మరేం లేదు. చిన్నప్పుడు నేను తెలుగు ఎక్కువగా చదివాను. అందులో నానార్థాలు అంటే చాలా ఇష్టం. అంటే ఒక పదానికి సరైన అర్థానిచ్చే అనేక పదాలుండటం: ఇప్పుడు నీ పేరే వుంది. 'హాసిత' 'హాసినీ' రెండూ ఒకే అర్థాన్నిస్తాయి. అందుకే నిన్ను ఈ టైమ్‌లో హాసిని అని పిలుస్తున్నాను.

భర్త ఇచ్చిన సమాధానం ఎందుకో హాసితకి తృప్తిని ఇవ్వలేదు. మరేం మాట్లాడలేదు.

పండుగ వస్తోందని ఇల్లంతా దులిపి సర్దుతోంది హాసిత. మూలనున్న పాత ట్రంకు పెట్టె కూడా దులుపుదామని తీసింది. దాన్లో కొన్ని పాత డైరీలు కనిపించాయి. ఎవరివో అని తీసి చూసింది. భర్త పేరు కనిపించింది. యధాలాపంగా తిరగేసిన హాసిత ఒకచోట "హాసినీ" అన్న పేరు చూసి ఆశ్చర్యపోయింది. ఆ డైరీలో ఏముందో చదవాలన్న కుతూహలం కలిగింది. డైరీని మొదటినుండి చదవసాగింది.

అది పవన్ కాలేజీ చివరి సంవత్సరం చదువుతున్నప్పటి డైరీ. ఆ సంవత్సరమే పవన్ క్లాసులో "సుహాసిని" అనే కొత్తమ్మాయి జాయిన్ అయింది. వారిరువురి మధ్య స్నేహం ఏర్పడి, క్రమంగా పెరిగి చివరికి ప్రేమగా మారింది. ఇరువురు పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. వారి పెద్దలు కూడా అంగీకరించారు.

విధి వక్రీకరించి ఒక రోడ్ యాక్సిడెంట్‌లో 'సుహాసిని' చనిపోయింది. దాంతో పిచ్చివాడయ్యాడు పవన్. క్రమంగా కోలుకున్నాడు. ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

ఆ డైరీలో అంతవరకే వుంది. మిగతాది తాను అర్థం చేసుకుంది హాసిత. ఆమె మనసు మొద్దుబారిపోయింది. ఒకసారి పవన్ అన్న మాటలు గుర్తొచ్చాయి. హాసిత నువ్వు అచ్చం నా గాళ్ ఫ్రెండ్ లాగ వుంటావు. నిన్ను చూస్తే ఆ అమ్మాయే గుర్తొస్తుంది.

అంతే తన భర్త తన మీద చూపిస్తున్న ప్రేమ నిజానికి తనకే కాదు. దూరమైన ఆ స్నేహితురాలిది.

ఇప్పుడు మీరు సెంటర్ సెన్సేషన్ కథ
రెండో పేజీ చదువుతున్నారు.



ఆ యధార్థం భరించలేకపోయింది హసిత. హఠాత్తుగా ఆమెకి ఏడుపు ముంచుకొచ్చింది. అక్కడే కూర్చుని చాలా సేపు ఏడుస్తూ వుండిపోయింది. పవన్ వచ్చేవేళ అవడంతో గబగబాలేచి పనులు మొదలుపెట్టింది. మాట్లాడకుండా ముభావంగా వున్న భార్యని చూసి ఆశ్చర్యపోయాడు పవన్. ఎప్పుడు గలగల మాట్లాడుతూ నవ్వుతూ వుండే హసిత ఇలా కామ్‌గా వుండడం అతను భరించలేకపోయాడు.

ఏం జరిగింది హసిత? ఇలా డల్‌గా వున్నావేం లాలనగా అడిగాడు.

"ఒకమాట అడుగుతాను నిజం చెప్తారా?" ప్రశ్నించింది భర్తని.

"అడుగు"

"నేనంటే మీకు ఎలాంటి ప్రేమ వుంది"

"అదేం ప్రశ్న. 'ఎలాంటి' ప్రేమ ఏమిటే. నువ్వంటే నాకు గుండెనిండా ప్రేముంది. నా భార్యగా నిన్ను ఎప్పుడూ ప్రేమిస్తాను.

"అబద్ధం" అరిచింది. మీ భార్యగా నా మీద ప్రేముండటం కాదు. మీరు ప్రేమించిన అమ్మాయి పోలికలు నాలో వుండటంవలన ఆ అమ్మాయిగానే నన్ను భావించి ప్రేమిస్తున్నారు.

"నన్ను మీరు ద్వేషించినా నేను భరిస్తానుగానీ, ఎవరినో నాలో చూసి నన్ను ప్రేమిస్తే, ఆ ప్రేమ నేను భరించలేము, ఆ ప్రేమ నాకు అక్కరలేదు" చేతుల్లో మొహం దాచుకుని ఏడ్వసాగింది.

పవన్‌కి ఏమీ అర్థం కాలేదు. "అసలు ఏమైంది హసిత, నువ్వు మాట్లాడుతోందేమిటే నాకేమి అర్థమవడంలేదు" అన్నాడు.

ఇప్పుడు మీరు సెంటర్ సెన్సేషన్ కథ మూడవ పేజీ చదువుతున్నారు.



చివ్వున లేచింది హాసిత. డైరీ అతని ముందు పడేసి ''ఇప్పుడు చెప్పండి'' అంది.

ఆ డైరీ చూసిన పవన్ పకపకనవ్వాడు. ఇది చూసా నువ్వు ఇంత హైరాన పడ్డావు. ఓయి పిచ్చీ! ఇదంతా నిజమనుకుంటున్నావా! ఒట్టి ట్రాష్!

నాకు బాగా నవలలు చదివే పిచ్చి వుండేది. నేను చదివిన ప్రతి నవలలోను ''హీరో కాలేజీలో చదవడం, అతని క్లాసులో ఆ సంవత్సరమే ''హీరోయిన్'' చేరడం, వారిద్దరూ ప్రేమించుకోవడం ఇలాగే వుండేది. దాంతో నేను నన్నే హీరోగా వూహించుకుని అలా డైరీ రాసాను. నీకో తమాషా చెప్పనా అసలు నేను చదివింది మగవాళ్ళ కాలేజీలో నీకు కోపం రాదంటే నీకో నిజం చెబుతాను''

'ఏమిటది' అన్నట్టు కళ్ళెత్తి చూసింది. హాసిత

''నాకు 'సుహాసిని' అన్న పేరంటే ఎందుకోగానీ చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. నీ పేరు చూసే నిన్ను పెళ్ళి చేసుకున్నాను.''

చివరికి హాసిత నోరు విప్పింది. ''మీకు నేను చెప్పేది ఒకటే జరిగింది ఎటు జరిగిపోయింది. మీరు నిజం చెప్పినా, అబద్ధం చెప్పినా ఆ డైరీ విషయం ఇంక నేను మర్చిపోతాను. నన్ను ద్వేషించినా నేను భరిస్తాను గానీ, ఎవరినో నాలో వూహించుకుని నాతో ప్రేమగా వుండడం మాత్రం నేను భరించలేను. నన్ను నన్నుగానే చూడండి. నన్ను ''హాసిని'' అని మాత్రం పిలవ్వద్దు.

''సారీ హాసిత! ఐయాం సారీ. నీ మనసేమిటో తెలుసుకోకుండా ప్రవర్తించాను. వెరీ వెరీసారి'' ఆమె చెయ్యిపట్టుకుని చెప్పాడు.

నీలిరంగుకాంతిలో వెలుగుతున్న బెడ్‌రూమ్‌లో ఒకరి కౌగిలిలో ఒకరు పరవశంలో అతడి నోటినుండి వచ్చింది ఒక పేరు 'హాసిత' అని!

వచ్చేవారం మరో సెంటర్ సెన్సేషన్ *